హైదరాబాద్ వార్త

మద్యం మత్తులో వ్యక్తి దారుణహత్య.. నిందితుల రిమాండ్

పేట్‌బషీరాబాద్, నవంబర్ 25 ప్రభాతవార్త: తాగిన మైకంలో మాటామాటా పెరిగి గొడవపడిన సంఘటనలో ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏసీపీ రామలింగరాజు, మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. మేడ్చల్ ప్రాంతానికి చెందిన జింకల వెంకటేష్(29),శ్రీరాముల శివ(33), ఎ.నర్సింగరావు(33),దేశ్‌రాజ్‌పాల్(25)నలుగురు ఎలాంటి పని చేయకుండా నిత్యం తాగుతుండేవారు. ఇటీవల శ్రీరాముల శివ ఇంట్లో మద్యం సేవించిన జింకల వెంకటేష్ సెల్‌ఫోన్‌ను అపహరించాడు.ఈ విషయం తెలుసుకున్న శివ వెంకటేష్‌ను మందలించేందుకు తన ఇద్దరు స్నేహితులైన నర్సింగరావు, దేశ్‌రాజ్‌పాల్‌తో కలిసి నలుగురు కృపాహౌజింగ్ కాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో మద్యం సేవించారు. మద్యం మత్తులో నలుగురు గొడవకు దిగడంతో శివ తన ఇద్దరు స్నేహితులతో కలిసి వెంకటేష్‌ను పొడవాటి కర్రతో తలపై తీవ్రంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితులు ఎలాంటి ఆధారాలు దొరకకుండా మృతుడి దస్తులు, వస్తువులు అక్కడే చలికాచుకుంటున్న మంటల్లో కాల్చిబూడిద చేశారు. అనంతరం హత్యకు ఉపయోగించిన కర్రను,మృతుడి సెల్‌ఫోన్‌ను డిబిర్‌పుర చెరువులో పడేశారు. శివ కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా సీసీ కెమెరాల్లో లభించిన ఆధారాల మేరకు నిందితులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దొంతనాలకు పాల్పడుతున్న నిందితుడి రిమాండ్

రూ.4లక్షలు, 6 ల్యాప్‌ట్యాప్‌లు స్వాధీనం

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎసీపి రామలింగరాజు

పేట్‌బషీరాబాద్,నవంబర్25 ప్రభాతవార్త: తాళాలు వేసిన ఇళ్ళను టార్గెట్‌గా చేసుకొని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితు డిని శుక్రవారం పేట్‌బషీరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏసీపి రామలింగరాజు తెలిపిన వివరాల ప్రకారం 11న వెన్నెలగడ్డ ప్రాంతానికి చెందిన బుసా రామచంద్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తి రూ.4.20లక్షలు దొంగలించాడని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తుండగా కొంపల్లి చౌరస్తాలో అనుమానాస్పందంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ఓల్డ్ అల్వాల్‌కు చెందిన ఎన్.శ్రీనివాస్(19)గా గుర్తించారు. పోలీసులు నిందితుడి శ్రీనివాస్‌ను తమదైన శైలిలో విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించాడు.అంతేకాకుండా తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి కటింగ్ ప్లేయర్‌తో తాళం పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతుండేవాడని, నిందితుడిపై అల్వాల్,చిలకలగూడ,పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో ఆరు దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి రూ.4లక్షలు, వివిధ కంపెనీలకు చెందిన 6ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రైలుకిందపడి యువకుడి ఆత్మహత్య

నాంపల్లి, నవంబరు 25 ప్రభాతవార్త : నాంపల్లి (హైదరాబాద్) జీఆర్‌పి పరిధిలోని గుర్తుతెలియని రైలుకిందపడి ఒక గుర్తుతెలియని యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన దుర్ఘటన ఈరోజు శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. జీఆర్‌పి హెచ్‌కానిస్టేబుల్ మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం లింగంపల్లి నుండి వికారాబాద్ మార్గంలో 4వ నంబరు ప్లాట్‌ఫామ్ చివరిలో కిలోమీటర్లు నంబరు 160/26-28 వద్ద ఒక గుర్తుతెలియని యువకుడు గుర్తుతెలియని రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడగా శరీరం ఛిద్రమై తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వయస్సు 35-40 సంవత్సరాలు. మృతుడు లేత క్రీం కలర్ ఫుల్‌షర్టు, లేతగులాబిరంగు గుండ్రనినెక్ టీషర్టు, నల్లరంగు జీన్స్‌ప్యాంటు, నీలంరంగు ఫుల్‌డ్రాయర్, మెడలో హనుమంతుడి బొమ్మ లాకట్ ధరించి ఉన్నాడు. పంచనామా అనంతరం మృతుడు శవాన్ని ప్రభుత్వ ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మార్చురీలో భద్రపరిచినట్లు, మృతుడు సంబంధీకులు పూర్తి వివరాలకు నాంపల్లి జీఆర్‌పి పోలీసుస్టేషన్ నంబరు 040-23202238 లేదా హెడ్‌కానిస్టేబుల్ మురళీకృష్ణ మొబైల్ నంబరు 9866357238లో సంప్రదించవచ్చునని తెలిపారు.

అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

కంటోన్మెంట్, నవంబర్ 25 ప్రభాతవార్త : అడ్డగుట్ట డివిజన్‌ను అభివృద్ధి పదంలో నడిపిన ఘనత తమదేనని డిప్యూటీ స్పీకర్ పద్మా రావు గౌడ్ తెలిపారు. అడ్డగుట్ట డివిజన్ పరిధిలో రూ. కోటీ 20లక్షల ఖర్చుతో పేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పద్మారావు గౌడన ప్రారంభించారు. తుకారం గేట్ రియోపాయింట్, బుద్ధనగర్, లాలాగూడ, కట్టెలమండి ప్రాంతాల్లో అభివృద్ధి పనులక శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో అన్ని డివిజన్‌లకు సంబంధించిన ప్రతిబస్తీ, ప్రతి కాలనీకి అన్ని అభివృద్ధి ఫలాలు దక్కెలా జాగ్రత్తలు పాటిస్తున్నామన్నారు. గడిచిన ఐదేళ్ల స్వల్ప సమయంలో అడ్డగుట్ట డివిజన్ పరిధిలో వందల కోట్ల రూపాయల భారీ ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఈఈ ఆశాలత, డీజీఎం కృష్ణ, టీఆర్ఎస్ నేతలు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, లింగాని శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

శ్రీలంక బస్తీలో పోలీసుల తనిఖీలు

నేరస్తుల కదలికలు తెలియాలంటే కార్డన్ సెర్చ్ తప్పని సరి

నార్త్ జోన్ డీసీపీ చందనాదీప్తి

కార్డన్ అండ్ సెర్చ్ వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ చందనాదీప్తి

బేగంపేట నవంబరు 25,ప్రభాతవార్త : నేరస్తుల కదలికలు తెలియాలంటే ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ తప్పనిసరి అని నార్త్ జోన్ డీసీపీ చందనాదీప్తి అన్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీలంక బస్తీలో శుక్రవారం తెల్లవారు ఝామున నార్త్‌జోన్ డీసీపీ చందనాదీప్తి ఆధ్వర్యంలో ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లు తో పాటు 400మంది పోలీసులు కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. శ్రీలంక బస్తీలోని గల్లీ గల్లీని పోలీసులు జల్లెడపట్టారు. అనంతరం బేగంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో చందనాదీప్తి మాట్లాడుతూ ప్రజలలో భయాన్ని పొగొట్టి వారికి ధైర్యం కల్పించాలంటే తరచూ ఆకస్మిక తనిఖీలు చేయనున్నామన్నారు. అత్యధికంగా నేరాలు చోటు చేసుకుంటున్న బస్తీలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో నిర్బంధ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీలలో భాగంగా ఎలాంటి పత్రాలు లేని 85వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, 11మంది అనుమానితులతో పాటు నలుగురు రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని విచారించామని చెప్పారు. గుట్కా తరలిస్తున్న ఒకరిని పట్టుకుని 600 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో డీసీపీ ఆశీష్ గౌతం, ఏసీపీ పృథ్వీధర్‌రావు, బేగంపేట ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, మోండ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరరావు, పలు పోలీస్‌స్టేషన్లకు చెందిన ఇన్స్‌పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి

ప్రదర్శనలో పాల్గొన్న మహిళా నాయకురాళ్ళు

సైఫాబాద్, నవంబరు 25 ప్రభాతవార్త: ప్రపంచంలో అత్యంత దోపిడీ వివక్షతకు గురవుతున్నది మహిళలే నని, సమాజంలో, కుటుంబంలో అతిక్రూరంగా హింసకు వేధింపులకు అణిచివేతతోపాటు అత్యాచారాలు, హత్యలకు బలవుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నదని భారత జాతీయ మహిళా సమాఖ్య సినీయర్ నాయకురాలు ప్రేమ్‌పావని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మహిళలపై హింసా వ్యతిరేక నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు అరకొర చర్యలు చేపట్టడం వల్ల మహిళలపై హింసా పెరిగిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. హింసకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అధ్యక్షురాలు నళిని మాట్లాడుతూ రోజురోజుకు మహిళలు, పిల్లలపై వేధింపులు ఎక్కువవుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి ఎస్.చాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

అధిక పొట్ట.. రోగాల పుట్ట

చిన్నారుల్లో సైతం..

ఇటీవల ఓప్రైవేట్ సంస్థ పలు కార్పొరేట్ పాఠశాలల్లో 8నుంచి 16ఏళ్ల వయస్సున్న విద్యార్థులపై సర్వే నిర్వహించగా ఈసర్వేలో 850మందిని పరిశీలించగా దాదాపు 350మందికిపైగా పిల్లలు ఊబకాయానికి గురైనట్లు వెల్లడైంది. గతపదేళ్లలో మారుతున్న ఆహార అలవాట్లు ఇతరత్రా కారణాలవల్ల చిన్నారుల్లోసైతం ఊబకాయం సమస్య తీవ్రంగా ఉంది. చదవుల్లో పోటీతత్వం పెరగడం, వ్యాయామంపై శ్రద్ధపెట్టకపోవడంతో బడిఈడు పిల్లలు సైతం ఈ వ్యాధికి గురవుతున్నారు.

పలు రోగాలకు ఇదే కారణం

నగరంలో 40శాతానికి పైగా ఊబకాయ బాధితులు

చిన్నారుల్లోనూ ఆందోళన కలిగిస్తున్న ఒబేసిటీ

సరైన జాగ్రత్తలు పాటించకుంటే తప్పని తిప్పలు

నేడు జాతీయ స్థూలకాయ వ్యతిరేక దినం

హైదరాబాద్, నవంబర్ 25, ప్రభాతవార్త: నేటి ఆధునిక సమాజంలో ఊబకాయం ఎంతో ప్రమాదకరంగా మారింది. అధిక పొట్ట-ఒక రోగాల పుట్ట అన్న వైద్యుల మాట అక్షర సత్యాలవుతున్నాయి. ఆరోగ్య సమస్యల్లో ఊబకాయం ప్రధాన సమస్యగా ఉంది. మారుతున్న జీవన పరిణామాలకు అనుగుణంగా ఆహార అలవాట్లు మారుతుండటంతో ఊబకాయం (ఒబేసిటీ) ప్రాణాంతక వ్యాధులకు దారి తీస్తుంది. శారీరక వ్యాయామం లేకపోవడంతో పెద్దలతో పాటు చిన్నారులు కూడా ఊదీని బారిన పడుతున్నారు. మోతాదుకు మించి ఆహారం తీసకోవడం, సరైన వ్యాయామం లేకపోవడం, ధూమ పానం, ఒత్తిళ్లు, కొన్ని సందర్భాల్లో వారసత్వం వల్ల కూడా దీని బారిన పడొచ్చు. ఒకవ్యక్తి తన ఎత్తు, వయస్సుకు తగ్గట్లుగా ఉండాల్సిన బరువుకు మించితే దీనిని ఆరోగ్య సమస్యగా గుర్తించవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. ఊబకాయం వల్ల గుండెకు సంబంధించిన వ్యాధులు, మధుమేహం, నిద్రలో సరిగా ఊపిరి తీసుకోకపోవడం (గురక) కీళ్లకు సంబంధించిన వ్యాధులు, కొన్నిరకాలైన కేన్సర్‌లాంటి సమ్యలు వచ్చే అవకాశం ఉంది. గ్రేటర్‌లో హైదరాబాద్‌లోని మొత్తంజభాలో దాదాపు 50శాతానికిపైగా ఊబకాయులే. అందులో ఉన్నతవర్గాలకు చెందిన మహిళలు, అన్ని వర్గాల పురుషులు కలిపి 60శాతం ఉన్నారు. చిన్నపిల్లలు కూడా 30-35శాతం వరకు ఈ వ్యాధి భారిన పడుతున్నారు. దీనికి కారణంగా చాలామంది గుండెపోటుకు గురవుతున్నారు. అధికరక్తపోటు మధు మేహం వంటి సమస్యలు వీరిని పట్టిపీడిస్తున్నాయి.

ముఖ్యంగా పిల్లల ఆహారపు అలవాట్లవల్లే ఊబకాయం అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. పిల్లలు బయట ఆటలకు దూరంగా ఉండటం, శారీరక శ్రమ లేకపోవడం, జీవేనశైలి, కొవ్వు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, శరీరంలో అధిక కొవ్వు పేరుకుపోవడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. అయితే ఊబకాయం రోగులకు తాజా ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స చేయించుకుంటే భవిష్యత్‌లో ఊబకాయం సమస్య ఉండదు. పైగా గుండెజబ్బులు, మధుమోహం, పక్షవాతం, తదితర వ్యాధుల నుంచి ఉపశమనం పొందే వీలుంటుంది.

నేడు పెట్లాబూర్జి ప్రభుత్వ ఆసుపత్రిలో

టిఫా స్కాన్ సెంటర్ ప్రారంభించనున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు

చార్మినార్, నవంబరు 25 ప్రభాతవార్త : పెట్లాబూర్జి ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆసుపత్రిలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు టిఫా స్కాన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పి.ప్రేమలత తెలిపారు. రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహ్మద్ మహమూద్ అలీ, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ శ్వేతా మహంతి, డిఎంఈ కె.రమేష్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఆమె తెలియజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

చిక్కడపల్లి, నవంబరు 25 ప్రభాతవార్త: చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురు వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. మరో 14 మందికి జరిమానా విధిస్తూ నాంపల్లి 4వ ఎంఎం కోర్టు న్యాయమూర్తి తుది తీర్పును వెలువరిచినట్లు స్థానిక ట్రాఫిక్ సిఐ ధరావత్ నానూనాయక్ పేర్కొన్నారు. మొత్తం 18 మందిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. ఉప్పుగూడకు చెందిన అర్జున్‌కు రెండు రోజుల జైలుశిక్ష, రూ.2100 జరిమానా, రామ్‌నగర్‌కు చెందిన షేక్ బాబులకు చెరి 5 రోజుల జైలుశిక్ష, రూ.3300 జరిమానా విధించినట్లు సిఐ వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం కిందకు వస్తుందని, ఎవరూ కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సాయన్న

కంటోన్మెంట్, నవంబర్ 25 ప్రభాతవార్త: ఇటీవల మంత్రి మాల్లారెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఇండ్లలో కేంద్ర ఐటీ దాడులు చేపట్టిన నేపథ్యంలో శుక్రవారం బోయిన్‌పల్లి లోని మంత్రి నివాసంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో మాట్లాడారు.

ఎన్నికలెప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి

బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

చిక్కడపల్లి, నవంబరు 25 ప్రభాతవార్త: ఎన్నికలెప్పుడు వచ్చినా సంస్థాగతంగా ఎదుర్కొవడానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధంగాఉండాలని బిజెపి ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు,రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గురువారం అశోక్‌నగర్‌లో బిజెపి ముషీరాబాద్ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్‌గా మల్లంపేట రమేశ్‌రామ్ రెండవసారి నియమితులైన సందర్భంగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, బిజెపి మహాంకాళి జిల్లా సికింద్రాబాద్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్‌లను మల్లంపేట రమేశ్‌రామ్ మర్యాదపూర్వకంగా సత్కరించే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నివర్గాల కోసం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తున్నారని, ఎంతో ఉన్నత ఆశయంతో మోదీ కార్యక్రమాలను రూపొందిస్తున్నారని అన్నారు. శ్యామ్‌సుందర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై స్పందిస్తూ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మల్లంపేట రమేశ్‌రామ్‌మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్నిబూత్ కమిటీలను, డివిజన్ కమిటీలతో పాటు మోర్చ కమిటీలను ఏర్పాటు చేసిపార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో బిజెపి జెండాను తిరిగి ఎగురవేస్తామన్నారు. నియోజకవర్గంలో కార్పొరేషన్, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే రిపీట్ అవతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు సుప్రియా నవీన్ గౌడ్, రచనశ్రీ, రవిచారి, టి.గోపాల్, భరత్‌గౌడ్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్, డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్, మహేందర్‌బాబు, రవికుమార్, నరేశ్, రామ్‌రెడ్డి, ప్రఫుల్‌రాంరెడ్డి, బిజెపి మహిళామోర్చ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీపద్మజ, రాజాగౌడ్, బిజెపి ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గసభ్యుడు పూస రాజు, మంగళ, గడ్డం నవీన్, ఉమేశ్, శ్యామ్, అనీల్, విజయ్‌కుమార్‌గౌడ్, చంద్రమోహన్, గంట శ్రీనివాస్, పిఎన్.చారి, శ్రీకాంత్, పాలశ్రీను, గౌడ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల కోసం మానవ హక్కుల కమిషన్ తలుపులు తెరిచి ఉన్నాయి: జస్టిస్ చంద్రయ్య

సభలో ప్రసంగిస్తున్న జస్టిస్ చంద్రయ్య

సైఫాబాద్, నవంబరు 25 ప్రభాతవార్త: బాధితులకు న్యాయం చేయడానికి అర్ధరాత్రి వచ్చిన తమ కమిషన్ తలుపులు తెరిచి ఉంటాయని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ బి.చంద్రయ్య చెప్పారు. ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారతదేశం కులం, మతం, జెండర్ సమస్యలతో నాటి నుంచి నేటి వరకు కోట్టుమిట్టాడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఐక్యరాజ్య సమితి 16 రోజుల పాటు రూపొందించిన ప్రచారోధ్యమాన్ని పురస్కరించుకుని దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో శుక్రవారం లక్డికాపూల్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన లీగల్ క్లినిక్‌లో ఆయన ప్రసంగించారు. చట్టాలు అమలు కాకపోవడానికి కారణం చట్టాలపై అవగాహన లేకపోవడమేనని చెప్పారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ వైజయంతి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల కేసుల జాప్యం జరుగుతున్నదని అందువల్లనే చట్టం నిర్వీర్యం అవుతున్నదన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం చాలా పటిష్టమైనదని ఇలాంటి లీగల్ క్లినిక్‌ల వల్ల బాధితులకు ధైర్యం, అవగాహన కలుగుతుందని, కేసుల విచారణలో అలస్యమైన బాధితులు రాజీపడవద్దని సూచించారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే ముందుగా అట్టడుగున ఉన్న దళిత, ఆదివాసీ స్త్రీలపై హింస తగ్గాలన్నారు. లీగల్ క్లినిక్‌లో ప్రవేశపెట్టిన కేసుల్లో హత్యలు, అత్యాచారాలు, దాడుల, సామూహిక దాడులు, ప్రేమ పేరుతో మోసాలు, భూకబ్జాలు, లైంగిక వేధింపులు లాంటివి ఉన్నాయి. బాధితులు రోదిస్తూ, భయపడుతూ తమకు న్యాయం చేయాలని సభకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్ యక్రమంలో యుసిడి డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ లక్ష్మి, కవిత, నాగలక్ష్మి, అంబాసిడర్ వినోద్‌కుమార్, రవిబాబు, అంబేద్కర్ రిసోర్స్ సెంటర్ ముఖ్య సలహాదారు పి.సత్యనారాయణమూర్తి, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు సత్యవతి, సజయ, వెంకట్‌రెడ్డి, దళిత స్త్రీ శక్తి రాష్ట్ర కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1 నుంచి 3వరకు ఒయూ పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష

వి.సి ప్రొ.రవీందర్ యాదవ్.. పరీక్ష మల్లాపూర్ నోమా ఫంక్షన్ హాల్ ఐయాన్ డిజిటల్ సెంటర్‌లో

పరీక్షల వివరాలను వెల్లడిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీంద్ యాదవ్

తార్నాక, నవంబర్ 25 ప్రభాతవార్త: డిసెంబర్ 1 నుంచి 3వరకు ఒయూ పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలు నిర్వహించనున్నట్లు ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు విసి ఓ.యూ సెనేట్ హాల్లో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసి పరీక్ష వివరాలను వెల్లడించారు. పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతించమని చెప్పారు. రోజుకు మూడు దఫాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు 47 సబ్జెక్టులలో 9776 మంది పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. హాల్ టికెట్టను శనివారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చాన్నారు. అభ్యర్థులు పరీక్షా సెంటర్‌కు గంట ముందుగానే అనుమతి నిస్తామని చెప్పారు. అత్యధికంగా కామర్స్ ఫాకల్టీలో 841 మంది దరఖాస్తు చేసుకోగా అత్యల్పంగా పర్షియన్ సబ్జెక్టులటో నలుగురు పరీక్షా రాయనున్నట్లు చెప్పారు. పరీక్ష గతంలో మాదిరిగానే కంప్యూటర్ బేస్డ్ టెస్టు అని పేర్కొన్నారు. ఎంట్రెన్స్ పేపర్ 70 మార్కులకు ఉంటుందని 39 మార్కులు అకడమిక్ క్రెడెన్షియల్స్ కేటాయించినట్లు చెప్పారు. ఈ రెండింటిని కలిపి ర్యాంక్ తీసి ఆ ర్యాంకు ఆదారంగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల అన్ని సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరిస్తున్నాం : విసి

విద్యార్థులు ఏలాంటి సమస్యనైనా తాము సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తున్నామని వైస్ చాన్స్‌లర్ ప్రొ. రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఓ.యూ కార్యాలయాలపై విద్యార్థులు ధాడులకు పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొంత మంది విద్యార్థులు కావాలనే అనేక రకాలుగా వర్సిటీలో అవాంతరాలు సృష్టిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఉద్యోగస్తుల సీపీఎస్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ద్వార కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.3కోట్లతో ఆర్ట్స్ కాలేజ్‌కు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇటీవల రూ. 40 కోట్లతో బాయిస్ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. బీ హాస్టల్‌ను రూ.2 కోట్లతో మరమ్మతు పనులు చేపడుతున్నామని, నూతన పరిపాలనా భవనం నిర్మాణం, ఓ.యూ పైలాన్ డిజైన్ చేయడం జరిగిందన్నారు.

విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

ముషీరాబాద్ కార్పొరేటర్ ఎం.సుప్రియానవీన్‌గౌడ్

విద్యుత్ మరమ్మత్తు చేయిస్తున్న కార్పొరేటర్ ఎం.సుప్రియానవీన్‌గౌడ్

ధర్నాచౌక్, నవంబర్ 25, ప్రభాతవార్త: ఎన్నో రోజులుగా ముషీరాబాద్ డివిజన్‌లోని షేర్‌అలీ గల్లీలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమస్యకు శాశ్వత పరిష్కారం జరిగిందని ముషీరాబాద్ కార్పొరేటర్ ఎం.సుప్రియానవీన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం కార్పొరేటర్ దగ్గర ఉండి సమస్య పరిష్కరించటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో బస్తీవాసులతో కలసి విద్యుత్ అధికారులకు సమస్య పరిష్కారం చేయాలని కోరుతూ వినతి పత్రం అందచేశామని తెలిపారు. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు నూతన విద్యుత్ కేబుల్స్ వేయ టం ద్వారా సమస్యను పరిష్కరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం నాయకులు అనిల్‌కుమార్, స్థానికులు మురళి, రమేస్, సత్యనారాయణ, యూసఫ్ పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో బస్తీ సంపర్క్ అభియాన్

బస్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

సికింద్రాబాద్, నవంబర్ 25 ప్రభాతవార్త : బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి కిందిబస్తీలో బస్తీ సంపర్క్ అభియాన్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. మహాంకాళి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎస్. రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యాక్రమంలో బీజేపీ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వర్‌రావు, జిల్లా కార్యాదర్శి కనకట్ల హరి, ప్రభుగుప్త, విఠల్, రాకేష్, నరేష్, వేణు గోపా ల్, శ్రీనివాస్, కోశాధికారి కృష్ణమూర్తి, రామ కృష్ణ, సత్య నారాయణ, కొమురన్న, శ్రీనివాస్, రమేష్, నరేష్, కృష్ణ, సురేష్, సందీప్, రవి, అచ్చయ్యలు పాల్గొన్నారు.

మాతృభాషను మరువద్దు

చిక్కడపల్లి, నవంబరు 25 ప్రభాతవార్త: వివిధ ప్రసారమాధ్యమాల్లో వ్యాఖ్యాతలుగా ఉన్న వారు మాతృభాషను మరువద్దని మాజీ కేంద్ర మంత్రి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. జీవిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీవీ ఛానల్స్ యాంకర్లకు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ వేణుగోపాలచారి హాజరై వివిధ ప్రసారమాధ్యమాలకు చెందిన వారికి పురస్కారాలను అందించి గౌరవించారు. ప్రముఖ సంఘసేవకులు డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు నామకరణం చేయాలి

చలో ఢిల్లీ పేరిట 12, 13 తేదీలలో నిరసన దీక్ష, మహాధర్నా

సైఫాబాద్, నవంబరు 25 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ పేరు నామకరణం చేయాలని, ఎస్సీల రిజర్వేషన్‌ల శాతాన్ని 20కు పెంచాలని డిమాండ్ చేస్తూ చలో ఢిల్లీ-2022 పేరిట డిసెంబరు 12, 13 తేదీలలో నిరసన దీక్ష, మహాధర్నా చేపడుతున్నామని పలు మాదిగ సంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ జెఎసి ఛైర్మన్, ఎస్సీ, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డా.పిడమర్తి రవి ఈ చలో ఢిల్లీకి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తమ డిమాండ్లను కేంద్రం అమోదించేంతవరకు ఉద్యమిస్తామని, అవసరమైతే బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన సచివాలయంకు అంబేద్కర్ పేరు నామకరణం చేయడం జరిగిందని, కేంద్రం కూడా పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు నామకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం గత రెండున్నర దశాబ్దాలుగా ఉద్యమిస్తున్నామని కాంగ్రెస్, బిజెపి పార్టీలు రిజర్వేషన్‌ల వర్గీకరణ కోసం మద్దతు ఇచ్చి ఎన్నికల్లో ఓట్లు దండుకుని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. బిజెపి తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని ప్రకటించి తీరని అన్యాయం చేస్తున్నదని పిడమర్తి రవి ధ్వజమెత్తారు. 2014లో టిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే అధారంగా మాదిగలు తెలంగాణ రాష్ట్రంలో 12 శాతం ఉన్నారని, జనాభా ప్రకారం 12 శాతం

చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డా.పిడమర్తి రవి

రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఊపిరి ఉన్నంత వరకు సిఎం కెసిఆర్‌తోనే ఉంటాను.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనే కాదు ఊపిరి ఉన్నంతవరకు సిఎం కెసిఆర్‌తోనే ఉంటానని పిడమర్తి రవి స్పష్టం చేశారు. ఇటీవల కొంత మంది మీడియా మిత్రులు తన మీద అపోహలు వేస్తూ పార్టీ మారుతున్నారా? అని అడుగుతున్నారని తాను పార్టీ మారాల్సిన అవసరం లేదని కెసిఆర్‌తోనే నాప్రయాణమని ఆయన ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటానని రవి స్పష్టం చేశారు. కెసిఆర్ తనని ఎంతో అదరించి రెండుసార్లు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించి రాష్ట్ర క్యాబినేట్ హోదా కలిగిన ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చారని ఆయన తెలిపారు.

బిజెపి ఆత్మీయ సమ్మేళనం గోడపత్రిక ఆవిష్కరణ

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న బిజెపి శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 25, ప్రభాతవార్త : కూకట్‌పల్లి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించబోయే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆవిష్కరించారు. వడ్డేపల్లి రాజేశ్వరరావుతో పాటుగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్వానీ సూర్యారావుల చేతులమీదుగా సన్నాహక కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆదివారం ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించబోయే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాల్సింది గా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షులు నాగరాజు, కూకట్‌పల్లి కంటెస్టెడ్ కార్పొరేటర్ పవన్‌కుమార్, ఓబిసి మోర్చా రాష్ట్ర బిజేవైఎం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అక్కినపల్లి సాయికుమార్, ఓబిసి మోర్చా జిల్లా అధికార ప్రతినిధి మహేష్‌చారి, సీనియర్ నాయకులు వినోద్, సాయి పాల్గొన్నారు.

దళిత పక్షపాతి భారతీయ జనతా పార్టీ

కరపత్రాలతో బిజెపి నాయకులు

నిజాంపేట్, నవంబర్25 ప్రభాతవార్త: బిజేపి పార్టీ దళిత పక్షపాతి అని బిజేపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు, సిద్ధిపేట జిల్లా కో-ఇన్‌ఛార్జ్ దాసి నగరాజు స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11బస్తీలలో రెండు రోజుల పాటు బస్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని బిజేపి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసి నాగరాజు మాట్లాడుతూ దళితులకు సముచిత స్థానం కల్పించిందని, అందులో భాగంగానే ద్రౌపది ముర్ముని రాష్ట్రపతిగా 12మందికి కేంద్రమ ంత్రులు, 40మంది ఎంపీలు, ఐదుగురిని గవర్నర్‌గా నియమించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో 70శాతం దళితులు లబ్ధిపొందుతున్నారని, తెలంగాణలో దళితులు బిజేపికి సంపూర్ణ మద్దతు తెలియజేయాలన్నారు. తెలంగాణలో బిజేపి ప్రభుత్వం ఏర్పడితే డబల్ ఇంజన్ సర్కారు ద్వారా దళిత సాధికారతకు మార్గం సుగమం అవుతుందన్నారు. అర్హులందరికి ఆయుష్మాన్ భారత్, ఈశ్రమ్ కార్డులను బిజేపి ప్రభుత్వం అందజేస్తుందని ఎస్ఎంసీ బిజేపి అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నాడు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు, కార్యకర్తలు దళితులు, స్థానికులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద టీఎస్‌యూటిఎఫ్ సభ్యులు

జీడిమెట్ల, నవంబర్ 25 ప్రభాతవార్త: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా టీఎస్‌యూటీఎఫ్ సంఘం అధ్యక్షుడు జయసింహారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులు లేక 7సంవత్సరాలు, బదిలీలు లేక నాలుగున్నర సంవత్సరాలవుతుందని, వాటిని వెంటనే జీఓ విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపడితే మరింత ఉత్సాహంగా విధులు నిర్వహిస్తారని, 100శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తారన్నారు. అదే విధంగా కేంద్రం పిఎఫ్ఆర్‌డిఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, మైపాల్‌రెడ్డి, కుమారస్వామి, శ్రీరాములు, లక్ష్మణ్, జనార్ధన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

నార్సింగి, నవంబర్ 25 ప్రభాతవార్త : నేడు విద్యుత్ లైన్ల మధ్య మరమ్మత్తుల కారణంగా 33/11కేవీ స్నేహితా హిల్స్ సబ్ స్టేషన్ పరిధిలోని 11.కే.వి.పిఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9.గంటల నుంచి మధ్యాహ్నం 2.గంటల వరకు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పిఅంట్‌టీ కాలనీ, ఏ,బి,సి,డి బ్లాక్, స్పెషల్ బ్లాక్, కిర్తి రిచ్‌మండ్ విల్లాస్, విద్యా నగర్, వీకర్ సెక్షన్ కాలనీ ప్రాంతాల విద్యుత్ వినియోగదారులంతా మాకు సహకరించాలని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఆహార కిట్ల ఆవిష్కరణ

మేయర్ గద్వాల విజయలక్ష్మి చేతులమీదుగా ఆహార కిట్లను ఆవిష్కరింపచేస్తున్న జి.జి.ఎఫ్ ఛైర్మన్ గడ్డంశ్రీనివాస్‌యాదవ్

బేగంబజార్, నవంబర్ 25 ప్రభాతవార్త: అంగన్‌వాడి కేంద్రంలో చదువుతున్న,పేద,విద్యార్థులకు ఫౌష్టికాహారంతో కూడిన ఆహారకిట్ల బ్యాగ్‌ను మేయర్ గద్వాల విజయలక్ష్మి చేతులమీదుగా జి.జి.ఎఫ్ ఛైర్మన్,టిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆవిష్కరింప చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలను ఆదుకోవడం సంతోషదాయకమన్నారు. యువతీ, యువకు లకు ఉపాధి అవకాశాలను కల్పించడం పట్ల ప్రత్యేకంగా అభినందించారు.

గౌడజనహక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జిల్లా ఇంచార్జ్‌ల నియామకం

జిల్లాఇంచార్జ్‌లుగా నియమితులైన వారిని సన్మానిస్తున్న నర్సాగౌడ్

హైదరాబాద్, నవంబర్ 25, ప్రభాతవార్త: గౌడజనహక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ)ను రాష్ట్ర వాప్తంగా మరింత విస్తరించడంలో భాగంగా 33జిల్లాలకు ఇంచార్జ్‌లను నియమించినట్లు జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం నగరంలో జరిగిన సమావేశంలో పలువురుని నియామకపత్రాలు అందజేసి సత్కరించారు. అదిలాబాద్ జిల్లా -బాలసాని నారాయణగౌడ్, నిర్మల్ - సీపతి లింగాగౌడ్, నిజామాబాద్, గ్రేటర్ హైదరాబాద్ - అమరవేణి నర్సాగౌడ్, కామారెడ్డి,ఉమ్మడి నల్గొండ -రాగులసిద్దిరాములుగౌడ్, సిద్దిపేట - ముత్యం నర్సింహులుగౌడ్, మెదక్ సంగారెడ్డి, వికారాబాద్ -కొండాపురం బాలరాజుగౌడ్, ఉమ్మడి అదిలాబాబాద్ -కేసరి ఆంజనేయులుగౌడ్, వరంగల్ ,హన్మకొండ-అనంతుల రమేష్, మేడ్చల్ -పల్లె ఉపేందర్‌గౌడ్, హైదరాబాద్ -బండారి రమేష్, కరీంనగర్-అరెల్లి మల్లాగౌడ్, రాజన్న సిరిసిల్ల -కదిరే ఆంజనేయులుగౌడ్, పెద్దపల్లి ములుగు-పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, భూపాలపల్లి -బుర్రకుమారస్వామిగౌడ్, యాదాద్రి భువనగిరి -పోశాల వెంకన్న, మంచిర్యాల -బూసారపు మెండేగౌడ్, అసిఫాబాద్ కొమరంభీం -నగునూరి నీరజ్‌గౌడ్, భద్రాద్రి కొత్తగూడెం బస్వా సరస్వతిగౌడ్, జోగులాంబ గద్వాల -విజయ్‌గౌడ్, సూర్యపేట - బెల్లంకొండ డ్యాంగేగౌడ్, నాగర్‌కర్నూల్ వనపర్తి -సోమ భాస్కర్‌గౌడ్‌లను జిల్లా ఇంచార్జ్‌లుగా నియమించినట్లు పేర్కొన్నారు.

టిఎన్‌జిఓ క్రీడాకారులతో ఎస్.ఎం ముజీబ్‌హుస్సేనీ

గన్‌ఫౌండ్రి,నవంబర్ 25ప్రభాతవార్త: హైదరాబాద్ జిల్లా టిఎన్‌జిఓ అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో జరుగుతున్న8వ చంద్రశేఖర్ మెమోరియల్ క్రికెట్ నాకౌట్ టోర్నమెంట్ మ్యాచులు జింఖానామైదానంలో ముగిసాయి. డిసెంబర్5 వచ్చేనెల తారీకు లాల్‌బహుదూర్ స్టేడియంలో సెమీ ఫైనల్స్‌కి అర్హత పొందిన టింవివరాలు: డెంటల్ కళాశాల,సెంట్రల్‌లైబ్రరీ,ఎక్సైజ్,ఆర్‌టిఏ యూనిట్లు జట్లు పాల్గొంటాయన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి విక్రమ్‌కుమార్,కార్యానిర్వాహక కమిటి అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్,జిల్లా కార్యవర్గసభ్యులు కె.శ్రీనివాస్,మురళీరాజ్, నరేష్‌కుమార్, వైధిక్‌శ్రాస్తి, ముఖీమ్‌ఖురేషీ, శ్రీధర్,ఎం.డి వహీద్,యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరుపుల గోదాంలో అగ్ని ప్రమాదం.. ఒకరికి గాయాలు

చాంద్రాయణగుట్ట, నవంబరు 25 ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణగుట్టలో ఓ పరుపులు తయారీ చేస్తున్న మిషనరీలో రాయి రావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీగా అగ్ని ప్రమాదం సంభవించిన ఒకరికి తీవ్ర గాయలైన సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట అలీనగర్‌లో షేక్ ఇలియాస్ గత 15 సంవత్సరాలుగా పరుపుల గోదాంను నిర్వహిస్తున్నాడు. ఈ గోదాంలో మహ్మద్ ఫాజిల్‌తో పాటు మరో 8మంది పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో మహ్మద్ ఫాజిల్ పని చేస్తుండగా ఉన్నట్టుండి ఓ రాయి రావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న పరుపులకు మంటలు విస్తరించాయి. దీంతో అక్కడే మిషనరీ వద్ద పని చేస్తున్న మహ్మద్ ఫాజిల్ రెండు కాళ్ళకు కాలిన గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, రెండు ఫైర్ ఇంజన్‌ల ద్వారా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు 15లక్షల ఆస్తినష్టం జరిగిందని యజమాని పోలీసులకు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాంద్రాయణగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్, సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాతనేరస్తుల అరెస్ట్

దొంగలించిన సొత్తును పరీశీలిస్తున్న డిసిపి సాయి చైతన్య

చాంద్రాయణగుట్ట, నవంబరు 25 ప్రభాతవార్త : చైన్ స్నాచింగ్, సెల్‌ఫోన్, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాతనేరస్తులను ఛత్రినాక, శాలిబండ పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 6లక్షలు విలువ చేసే బంగారం, సెల్‌ఫోన్, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం దక్షిణ మండలం పోలీస్ కార్యాలయంలో డిసిపి సాయి చైతన్య, ఫలక్‌నుమా ఏసిపి షేక్ జహంగీర్, ఇన్స్పెక్టర్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీతో కలిసి వివరాలు వెల్లడించారు. చంపాపేట సింగరేణి కాలనీకి చెందిన మన్సూర్ అహ్మద్ అబ్రార్ అలియాస్ అబ్బూ(27), అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ సాదిక్(20)లు దొంగతనం కేసులో పాతనేరస్తులు. ఇరువురు ఇద్దరు గతంలో రాచకొండా, సైబరాబాద్ పోలీస్టేషన్ పరిధిలో గతంలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్ళి వచ్చారు. జైలు నుండి వచ్చిన ఇద్దరు మారకుండా మళ్ళీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 24వ తేదిన ఛత్రినాక, శాలిబండా పోలీస్టేషన్ పరిధిలో దొంగతనాలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో పోలీసులు సిసి కెమరాల సహాయంతో నిందితులను గుర్తించి తమదైన శైలిలో విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుండి 3.5 తులాల బంగారు చైన్, 8 సెల్‌ఫోన్‌లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని పీడి యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినట్లు డిసిపి సాయిచైతన్య తెలిపారు. 24గంటల్లో కేసును చేధించిన పోలీసు సిబ్బందిని డిసిపి అభినందించారు.

ఫారెస్ట్ ఆఫీసర్ హత్యకు నిరసనగా టింబర్ డిపోల బంద్‌కు పిలుపు

అప్జల్‌గంజ్, నవంబర్ 25 ప్రభాతవార్త: విధినిర్వహణలో హత్యకు గురైన ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు కుటుంబానికి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అండగా నిలుస్తామని ప్రకటించడం పట్ల తెలంగాణ టింబర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్.రమణయ్యప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.హిందీనగర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టింబర్‌ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్ని ఫారెస్ట్ ఆఫీసర్ హత్యకు నిరసనగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఒక రోజు తెలంగాణ వ్యాప్తంగా టింబర్ డిపోల బంద్‌కు పిలుపు నిచ్చారు.ఈసందర్భంగా రమణయ్య మాట్లాడుతూ టింబర్‌డిపోలు,ఫారెస్ట్ అధికారుల సూచనల మేరకునడుచుకునేవారమని,శ్రీనివాస్‌రావును గుత్తి కోయల దాడిలో మృతి చెందడం బాధాకరమని,వారి కుటుంబానికి సానుభూతినిప్రకటించారు.తెలంగాణ వ్యాప్తం గా ఉన్న టింబర్ డిపోలబందులో పాల్గొనాలని డిపోల యాజమానులను కోరారు. సెక్రటరీ గోపికృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత విషయంలో శ్రద్ధ చూపండి

కార్పొరేటర్ దొడ్ల

దోమల మందులను పిచికారి చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 25, ప్రభాతవార్త : పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు ప్రాంతాల ప్రజలు దోమల బెడద ఎక్కువగా ఉందని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ జిహెచ్ఎంసి ఎంటోమోలజి సిబ్బందితో కలిసి ఎల్లమ్మ చెరువులో డ్రోన్ యంత్రం సహాయంతో దోమల నివారణ మందులు పిచికారి చేయించారు. అదేవిధంగా చెరువులో పేరుకున్న గుర్రపుడెక్కను సిబ్బందితో కలిసి కార్పొరేటర్ స్వయంగా తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చిన చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. చెత్తను నాలాలలో గానీ చెరువులలో గానీ వేయొద్దని పారిశుద్ధ సిబ్బంది వాహనాలలో మాత్రమే వేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాములుగౌడ్, మల్లేష్, ఎంటోమొలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో బోరు వేయించిన ఎమ్మెల్యే

బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, నవంబరు 25 ప్రభాతవార్త: కాచిగూడ డివిజన్‌లో ప్రజల దప్పికలను తీర్చేందుకు తన సొంత డబ్బులు ఒక లక్షా 50 వేల ఖర్చుతో వేస్తున్న బోరు నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శంకుస్థాపన చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురికాకుడదనే భావనతో సొంత డబ్బులతో బోరు వేయిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అశోక్, తిరుమల్, మురారి, శ్రీకాంత్, వాసు, లడ్డు, నాగేష్, సాయి, లక్ష్మీబాయి, లత పాల్గొన్నారు.

నల్లకుంటలో సిసి రోడ్డు పని ప్రారంభించిన ఎమ్మెల్యే.. సల్లకుంట గాంధీనగర్‌లంకలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభోత్సవం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత కలిసి ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

పిఆర్‌టియు అభ్యర్థి చెన్నకేశవరెడ్డి గెలుపు తథ్యం

పిఆర్‌టియు టిఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్న కేశవరెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నార్సింగి, నవంబర్ 25 ప్రభాతవార్త : పిఆర్‌టియు టిఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జు చెన్న కేశవరెడ్డి గెలుపు తథ్యమని, ఉపాధ్యాయులంతా ఆయన ప్రచారానికి బ్రహ్మరథం పడుతున్నారని పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్‌రావ్ పేర్కొన్నారు. శుక్రవారం గండిపేట్ మండలంలో చెన్న కేశవరెడ్డి ప్రచారం జోరుగా కొనసాగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కమలాకర్‌రావ్ మాట్లాడుతూ సీపిఎస్ రద్దుకు ప్రభుత్వం అనుకూలంగా ఉందని, బదిలీలు, పదోన్నతుల సెడ్యూల్ వస్తుందని, పండిత, పిఇటిల అప్‌గ్రేషన్, 317జీవో సమస్యలు త్వరలో పరిష్కరించబడుతాయని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కన్నయ్య గారి గోవరనదన్ యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన నాయకుడు చెన్న కేశవరెడ్డిని చట్ట సభలకు పంపితే మన సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు చెన్న కేశవరెడ్డికి వేసి భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, జిల్లా పత్రికా సంపాదక వర్గ సభ్యులు కృష్ణారెడ్డి, గండిపేట్ మండల అధ్యక్షులు మల్లేష్, ప్రధాన కార్యదర్శి బి.నర్సింలు, గౌరవ అధ్యక్షులు కిరణ్, రాష్ట్ర బాద్యులు రాములు, శ్రవణ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూపార్కులో ముగిసిన జంతువుల సంరక్షణ సదస్సు

కార్యక్రమంలో సెంట్రల్ జూ అథారిటీ న్యూఢిల్లీ సెక్రటరీ డాక్టర్ సంజయ్ కుమార్ శుక్లా

చార్మినార్, నవంబరు 25 ప్రభాతవార్త : నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్కులో జంతువుల సంరక్షణ, వసతులపై మూడు రోజుల పాటు జరిగిన సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సెంట్రల్ జూ అథారిటీ న్యూఢిల్లీ సెక్రటరీ డాక్టర్ సంజయ్ కుమార్ శుక్లా సదస్సులో పాల్గొన్న 10 రాష్ట్రాలకు చె

జులై నాటికి అందుబాటులోకి స్టీల్ బ్రిడ్జ్

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నిర్మాణ పనితీరును అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ధర్నాచౌక్, నవంబర్ 25, ప్రభాతవార్త: వీఎస్టీ నుండి ఇందిరాపార్కు చౌరస్తా వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జ్ వచ్చే జులై నాటికి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శుక్రవారం సంబంధిత అధికారులు, స్థానిక టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 426 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఈ బ్రిడ్జ్ దేశంలోనే అతి పెద్ద స్టీల్ బ్రిడ్జ్‌లలో ఒకటని అన్నారు. 81 పిల్లర్స్‌తో, ఒక పిల్లర్‌కు, ఇంకో పిల్లర్‌కు మధ్య ఆరు కట్టర్స్ వస్తాయని, ఒక్కో కట్టర్ 17 టన్నుల బరువుతో ఉండటం వల్ల పగలు పనులు చేయటం కష్టమవుతోంది కాబట్టి ఎక్కువపని రాత్రి సమయంలోనే కొనసాగుతోందని తెలిపారు. 2.6 కిలోమీటర్ల దూరంతో నిర్మిస్తున్న ఈ స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల వల్ల ఏర్పడే ఇబ్బందులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జైసింహ, టీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, వల్లాల శ్యాంయాదవ్, రాజ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

27న భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖ వందే భారతం నృత్యపోటీలు

నాంపల్లి, నవంబరు 25 ప్రభాతవార్త : భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖ, దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం నాగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27 ఆదివారం బోయిన్‌పల్లి మనోవికాస్‌నగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హ్యాండీక్యాప్డ్ ఆడిటోరియంలో వందే భారతం శీర్షికన నృత్యపోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ అధికారి విశ్వకర్మ డిఆర్‌కె విలేకరులకు తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన 200లకుపైగా కళాకారులు పాల్గొని తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన కళాకారులు 2023 జనవరి 26న న్యూఢిల్లీలో జరిగే భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లోని సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. 27న ఉదయం 11గంటలకు ఈ పోటీలను కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారని, దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం నాగపూర్ సంచాలకుడు డా. దీపక్ ఖిర్వాడ్కర్, కార్యక్రమ అధికారి దీపక్ పాటిల్, విశ్వకర్మ డిఆర్‌కె., కార్యక్రమ సమితి సభ్యులు పాల్గొంటారని ఆయన వివరించారు.

పాశ్చాత్య వస్త్రాధారణ, అలవాట్లకు బానిసలు కావొద్దు

మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథి గోగు శ్యామల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు

బేగంపేట నవంబరు 25,ప్రభాతవార్త : విద్యార్థులు పాశ్చాత్య వస్త్రధారణ, అలవాట్లకు బానిసలు కావద్దని డా.గోగు శ్యామల పిలుపు నిచ్చారు.శుక్రవారం బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం,ఎన్ఎఫ్ హెచ్ నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మోని ఫ్లాగ్ డే ఉత్సవాలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డా.గోగు శ్యామల హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువతరం మత సామరస్యాన్ని పెంపొందించుకోవాలని,భారత రాజ్యాంగ స్ఫూర్తిని భావి తరాలకు అందించాలని పిలుపు నిచ్చారు.ముందుగా ప్రతి ఒక్కరూ వారు తీసుకునే ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే వారి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. జ్యోతీరావు పూలే సతీమణి సావిత్రీబాయి పూ లేను చదువుల తల్లిగా విధ్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విధ్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ,వ్యాసరచన,పోస్టర్ పెయింటింగ్ పోటీలలో ప్రతిభ చాటిన వారికి బహుమతులను అందించారు.ఈ కార్యక్రమంలో డా.కె.వెంకటేశ్వర్లు, డా.యం.మధుకరరావు, డా.మాధురి,డా.ప్రసన్న,డా.పద్మకుమారిలతో పాటు విధ్యార్థులు పూజా,నవ్య, శిరీషా,పాయల్‌దాస్,దీపిక,అక్షయ తదితరులు నిర్వహణలో తమ సహకారాన్ని అందించారు.

ఉద్యమ నాయకులు కలిసికట్టుగా టిఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు, శాసనసభ్యులు మాగటి గోపినాథ్‌ను కలిసిన గోషామహల్ నియోజకవర్గం టిఆర్ఎస్ నాయకులు

గోషామహల్, నవంబర్ 25 ప్రభాతవార్త: గోషా మహల్ నియోజకవర్గం టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమనాయకులు కలిసికట్టుగా టిఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని గ్రేటర్ హైదరాబాద్ జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు, శాసనసభ్యులు మాగంటి గోపినాథ్ సూచించారు. ఈనెల 27వ తేదిన గోషామహల్ నియోజకవర్గం టిఆర్ఎస్ జనరల్‌బాడీ సమావేశ ఏర్పాట్లకు సంబంధించి జూబ్లీహిల్స్ శాసనసభ్యులు,జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్‌ను కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ప్రేమ్‌కుమార్‌దూత్, తెరాస నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్, జాంబాగ్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు మీసాలక్రాంతిలు మర్యాద పూర్వకంగా కలిశారు.గోషామహల్ నియోజకవర్గంలో టిఆర్ఎస్‌లో జరుగుతున్న రాజకీయాలకు అనుగుణంగా ముఖ్యవిషయాలను చర్చించినట్లు తెలిపారు.ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.ఈ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలు కరోనా కాలంలోని వేతనాలు చెల్లించాలి

తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్ల ఫోరం డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పూజా చౌదరి తదితరులు

హైదరాబాద్, నవంబర్ 25, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు కరోనా కాలానికి సంబంధించి వేతనాలు చెల్లించాలని తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్ల ఫోరం అధ్యక్షులు మాసం రత్నాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా డాక్టర్ కె.పూజా చౌదరి, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి మాధవిలను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవిడ్ 19 నేపథ్యంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి దాదాపు 36నెలల వేతనాలు బకాయి ఉన్నాయన్నారు. యాజమాన్యాలు అంటున్న నోవర్క్ నో పే అంశం అసంబంధమైనదని, దీన్ని ఫోరం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఉపాధ్యాయుల నైపుణ్యం, అనుభవం ఆధారంగా వేతనాలు పెంచాలన్నారు. ఈసమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి కల్లి చంద్రశేఖర్‌రావు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు టి.శ్రీనివాస్, నాయకురాలు లలిత, స్వప్న, మౌనిక, రజనీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

హైదరాబాద్, నవంబర్ 25, ప్రభాతవార్త: అమీన్‌పూర్ మండలం అయిలాపూర్ విలేజ్‌లోని విద్యుత్ ఎంప్లాయిస్ కోఆపరేటవ్ హౌసింగ్ సొసైటీకి గానూ నూతన కార్యనిర్వాహన కమిటీని ఎన్నుకున్నారు. ఈమేరకు ఎన్నిక అధికారి ఈ.గంగారెడ్డి కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా హెచ్‌టి రమేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎంఎస్‌కె ప్రసాద్, సెక్రటరీ-కె.బుచ్చిబాబు, ట్రెజరర్ ఎస్. హనుమాండ్లు, మేనేజింగ్ కమిటీ మెంబర్లుగా ఎస్, సుభాష్‌చంద్రబోస్, మహదేవ్‌సింగ్, ఖాజాజమీరుద్దీన్, రాజబాబు, మధురబాయి, రవిజయప్రద, సుజాతలీల ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కమిటీ 5ఏళ్లపాటు 2027కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా ఆడిట్ దివాస్

మెట్టుగూడ, నవంబర్ 25 ప్రభాతవార్త: ప్రిన్సిపల్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ సౌత్ సెంట్రల్ రైల్వే ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సికింద్రాబాద్‌లో ఆడిట్ దివాస్ వేడుకల్లో భాగంగా ఆడిట్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐఆర్ఎస్ అధికారి(ఎఫ్ఎ) వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం,సమాజ హితం కోసం ఆడిట్ ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఆడిట్ చేసేసమయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎఫ్ఎ వివేకానంద, ఏఫ్ఏ అండ్ సిఏఓ కొర్రం కిషోర్, సీనియర్ డిఎఫ్ఎం కేషవ్ కాప్లుష్, డిప్యూటీ ఎఫ్ఎ హరిష్ వెల్లంకి, డిప్యూటీ డైరెక్టర్ (ఆడిట్) డా. రామలక్ష్మి, వేణుగోపాల్, ప్రవీణ్‌తో పాటు పలువురు ఆడిట్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.జంగయ్య, చావ రవి

ధర్నాచౌక్, నవంబర్ 25, ప్రభాతవార్త: ఉపాధ్యాయుల వేతనాలు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.జంగయ్య, చావ రవి డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ గత రెండు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు వేతనాలు మొదటి తేదీన ఇవ్వటం లేదని, అనుబంధ వేతనాలు, సెలవు వేతనాలు, జిపిఎఫ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్, పీఆర్సీ, డీఏ బకా యిలు, విశ్రాంత ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర బిల్లులు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ నెలలు గడుస్తున్నా నిధులు విడుదల చేయలేదని అన్నారు. అవసరాలకు డబ్బు సర్దుబాటు కాక, పలువురు ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బకాయిల చెల్లింపుకు నిర్దిష్ట గడువు విధించి, టోకెన్ నెంబర్ల ప్రకారం నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లాలాపేట్ సిరిపురి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిప్యూటీ మేయర్‌కు వినతి

నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సిరిపురి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

తార్నాక, నవంబర్ 25 ప్రభాతవార్త: లాలాపేట్ సిరిపురి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డికి కాలనీ అసోషియేషన్ ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. అదేవిదంగా శివాలయం ముందు రైల్వే అధికారులు నిలిపివేసిన రోడ్డు పనులను కూడా ప్రారంభం చేసేందుకు జీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు చూస్తానని వారికి హామినిచ్చారు.ఈ కార్యక్రమంలో కమిటీల ప్రసిడెంట్ శివరామి రెడ్డి, వైస్ ప్రసిడెంట్ క్రాంతి,జీఎస్ రాఘవేందర్ తధితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏడు గుడుల వార్షికోత్సవాలు

ఆలయంలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న నేతలు

కంటోన్మెంట్, నవంబర్ 25 ప్రభాతవార్త : బోయిన్‌పల్లిలోని ఏడు గుడులు ఎంతో ప్రాచూర్యం పొందాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఆలయంలో జరిగిన 34వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నఆరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయిన్‌పల్లి గురించి చెప్పుకోవాల్సి వస్తే ముందుగా ఏడు గుడుల గురించి చర్చించుకుంటారని అన్నారు. ప్రతియేడు లాగే ఈయేడు కూడా ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నాగేష్, మర్రి అమరేందర్‌రెడ్డి ఇతర నేతలు పల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్ స్వాధీనం

ధర్నాచౌక్, నవంబర్ 25, ప్రభాతవార్త: తక్కువ ధరకు తెల్లకార్డు వారి వద్ద కొని, ఎక్కువ ధరకు అమ్మేందుకు పీడీఎస్ రైస్‌ను అక్రమంగా తరలిస్తు న్న ఒక వ్యక్తిని ముషీరాబాద్ పోలీసులు మరియు సివిల్ సప్లై అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ముషీరాబాద్ ఎస్‌హెచ్ఓ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం భోలక్‌పూర్‌లో నివసించే మహ్మద్ సొహెల్ (25) జెమినీ కాలనీ నుండి జహీరా బాద్‌కు తరలిస్తున్నా డనే విశ్వస నీయ సమాచారం మేరకు ముషీ రాబాద్ పోలీసులు, సివిల్‌సప్లై అధికారులతో కలసి దాడి చేశారు. వాహనంతలో తరలిస్తున్న 25 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకుని, సోహెల్‌ను అరెస్ట్ చేశామని జహంగీర్ యాదవ్ తెలిపారు.

లబ్దిదారులకు చెక్కులను అందజేసిన మంత్రి తలసాని

లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, నవంబర్ 25 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రం అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలతో అనేకమంది లబ్దిపొందుతున్నారని పశుసంవర్థక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లలోని ఆయన నివాసం వద్ద 7 మందికి కల్యాణలక్ష్మీ, 7మందికి షాదీముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న కార్యాక్రమాలు దేశానికే ఆదర్శమని అన్నారు. పేదింటి ఆడపడుచు పెండ్లికి రూ. ఒకలక్షల 116 రూపాయలు ఆర్థిక సహాయం అందించే గొప్ప కార్యాక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఇదే కాకుండా అసరా పెన్షన్ కింద వృద్దులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, దుస్తులను పంపిణి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులలో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. గుండే, మోకాళ్ళు ఇతర అవయవాల మార్పిడి వంటి చికిత్సలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్ నామన శేశుకుమారి, ఉప్పల తరుణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేసిన మంత్రి తలసాని.. సనత్‌నగర్‌కు చెందిన సతీష్ కొంతకాలంగా క్యాన్సర్ వ్యాదితో బాధపడుతున్నాడు చికిత్స నిమిత్తం సిఎం సహాయనిధి నుండి మంజూరైన రూ. 2.5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం పత్రాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసం వద్ద అందజేశారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్ కొలన్‌లక్ష్మీ, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి సిఎం కెసిఆర్ పెద్దపీట వేశారు : ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని బైరాగిగూడలో ఉన్న మైనార్టి గురుకుల పాఠశాలలో జరిగిన జాతీయ విద్యా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, నవంబర్ 25 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో మైనారీటల సంక్షేమానికి సిఎం కేసీఆర్ పెద్దపీట వేశారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని బైరాగిగూడలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రకాశ్‌గౌడ్ మాట్లాడతూ తెలంగాణలో 50.లక్షల మంది మైనార్టీలు ఉన్నారని, వీరి సంక్షేమభివృద్ధికి, విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ముస్లీంలు, క్రిస్టియన్‌లు, బౌద్దులు, జైనుల సామాజిక, సాంఘీక, విద్య, సాంస్కృతి అభివృద్ధికి మైనార్టీ శాఖను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించడం జరుగుతుందన్నారు. మైనార్టీల కోసం తెలంగాణ స్వరాష్ట్రంలో డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. షాదీ ముబారక్, సీఏం ఓవర్సిస్ స్కాలర్‌షిప్, గ్రాంట్ ఇన్ పతకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, టీఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సరిత, కార్పోరేటర్లు తలారి చంద్రశేఖర్, సాగర్‌గౌడ్, సీనియర్ టీఆర్ఎస్ నాయకులు పాపయ్య యాదవ్, నాగరాజు, సయ్యద్ ఖాజా, పాండు, సాయిబాబాగౌడ్, రాజు నాయక్, సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

మల్లారెడ్డిపై వచ్చే ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల, చెన్నయ్య

హైదరాబాద్, నవంబర్ 25, ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రి మల్లారెడ్డిపై ఐటీ రైడ్స్ జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీలు సైతం ఎవరికి వారు రాజకీయ రంగు పూసి సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నా రని ఆయనపై వస్తున్న ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లంబాడీ ఐక్యవేదిక అధ్యక్షులు రాజ్‌కుమార్ జాదవ్, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్యలతో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా జాజుల మాట్లాడుతూ ఐటీరైడ్స్ టిఆర్ఎస్-బిజెపి పంచాయితీ అని చెప్పి ప్రతిపక్ష నేతలు ఎవరు మాట్లాడటంలేదని పేదళ్లను దోచుకునే ఏవిద్యాసంస్థ అయినా సరే అవినితి బయటకు తీయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే సిఎం కెసిఆర్ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ సీట్లు, ఎంబిబిఎస్ సీట్లలో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించి డొనేషన్లు వసూలు చేసి పేదళ్లను దోచుకునే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో వివిధ సంఘాల నాయకులు లింగంగౌడ్ పాల్గొన్నారు.

ఇళ్లను తొలగిస్తే యుద్ధమే

చిక్కడపల్లి, నవంబరు 25ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ జరిధిలోని హుస్సేన్‌సాగర్ వెంట ఉన్న దోభీఘాట్ వాసుల ఇళ్ళను తొలగిస్తే యుద్ధమేనని బిజెవైఎం పూర్వజిల్లా అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ హెచ్చరించారు. నాలా వెంట ఉన్న ఉన్న వారి ఇంటి నుంచి ఒక్క ఇటుక కూడా పోనివ్వబోనని, ఇళ్ళు కూల్చే ప్రశ్నేలేదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ దోభీఘాట్ వాసులకు ఏం సమాధానం చెబుతారని హెచ్చరించారు.

తిరుపతి దేవస్థానం అడ్వైజరి కమిటీ సభ్యుడిని కలిసిన నాయకులు

రాజేశ్వరరావును అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 25, ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీనాయకులు తిరుమల తిరుపతి దేవస్థానం అడ్వైజరి కమిటీ సభ్యులు రాజేశ్వరరావును కూకట్‌పల్లి రాష్ట్ర బిజేవైఎం సంయుక్త కార్యదర్శి, కంటెస్టెడ్ కార్పోరేటర్ నాయినేని పవన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ బిజేవైఎం ఉపాధ్యక్షులు సాయి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
'ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

సిరీ నెం.44/EE-9/CRZ/GHMC/2022-23. పనిపేరు: (25) నెం.ల పనులు. అంచనా విలువ (రూ.లక్షల్లో): 237.90. బిడ్‌లను ప్రారంభ తేదీ/ చివరి తేదీ మరియు సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 24.11.2022న మ.2.00గం.లు. బిడ్‌ల సీలరణను చివరి తేదీ: 01.12.2022న మ.2.30గం.లు. అదేరోజు పేరు, చిరునామా మరియు సెల్ నెం. శ్రీ షేక్ సనావుద్దీన్, EE, డివిజన్-8, హుమాయిన్‌నగర్, హైదరాబాద్. ఫోన్ నెం.7993727669. మరిన్ని వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.eprocurement.gov.in పై చూడవచ్చును. గమనిక: (1) బిడ్డరు ప్రకటన తేదీ ఆరోజుతో 1% బయానాను ఉమ్మడిగాను మరియు సవరణ చెయడం వెంటనే దాని ఈ కార్యాలయమునందు మూడు రోజులలోపుగా సమర్పించవలెను. లేని పక్షంలో ఎలాగు తెరా గమనింపబడినట్లయితే, మీరు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లలో G.O.Ms.No.174 తో & CAD (Pro.No.300/W-సంస్కరణలు) విభాగం, తేదీ: 01.09.08 ప్రకారం మూడు సంవత్సరాల కాలంపాటు నిషేధానికి గురవుతారు. (2) కేవలం రిజర్వు చేయబడిన ఐటమ్ పనులు రిజర్వు చేయబడిన వారికి వర్తించే సేల్ సర్టిఫికేట్‌ల 1% కాంట్రాక్టు నుండి మినహాయింపబడతారు మరియు ఇతర పనులకు వారు 1% కాంట్రాక్టు నెట్టింపజాల్సి ఉంటుంది.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు డివిజను-8, CRZ, హైదరాబాద్ మహానగరపాలక సంస్థ.

DIPR.No.9422-PP/CL/Advt/1/2022-23 తేదీ: 25.11.2022

వార్త CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, MADDURI SRIDEVI, R/o. 1-3-183/40/16, SBI Colony, Gandhi Nagar, Hyd-80. Changed my Name as PATRI SRIDEVI, W/o.PATRI SUBRAMANYA SARMA.

(Ro.No.061584)

LOST CERTIFICATES

★ SHARE CERTIFICATES OF Shri Ram Transport Finance Company. Set-1: Reg. Folio 72704, Set-2: Reg. Folio 12980 Certificates on my daughter Gouri Pidugu Name were lost when we Shifted our house Saraswathi Pidugu, R/o. 1-1-298/1, Ashok Nagar, Hyd-20.

(Ro.No.061585)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైనసంబంధంలేదు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE-cum-VII ADDITIONAL METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT, AT: HAYATHNAGAR
O.S.NO.832 OF 2022

BETWEEN:
A. SUSHEELA And others ...PLAINTIFFS
AND
THE TAHSILDAR, Abdullapurmet Mandal And others ...DEFENDANTS

To
D-2 All concerned

NOTICE

It submitted that the Plaintiffs had filed the above suit seeking to declare them as the legal heirs of Late A.Reshma, D/o Late A.Bhashya in respect of

రోడ్డు ఆక్రమిస్తూ చేపట్టిన తాత్కాలిక కట్టడాల కూల్చివేత

పోలీసులు, మున్సిపల్ సిబ్బంది, అధికారుల సహాయంతో చర్యలు

పోలీసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి జెసిబిలతో ఆక్రమణలను కూల్చివేస్తున్న దృశ్యం

తుర్కయంజాల్, నవంబర్ 24 ప్రభాతవార్త : ఆక్రమణలపై తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధికారులు దృష్టి పెట్టి సాగర్ హైవే రేడియల్ రహదారిని ఆక్రమిస్తూ చేపట్టిన తాత్కాలిక కట్టడాలను కూల్చివేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని బొంగులూరు ఔటర్‌నుంచి గుర్రంగూడ వరకు సుమారు 9 కిలోమీటర్ల మేరకు సాగర్ ప్రధాన రహదారిలో ఆక్రమణలు తొలగించారు. పట్టణ ప్రణాళిక విభాగం ముందస్తు చర్యలు తీసుకుంది. వ్యాపార సముదాయాలు రోడ్డుకు దగ్గరగా విస్తరించడంతో వాహనదారులు రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తుంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండడంతో వీటి నివారణకు రహదారి ఆక్రమణలు తొలగించేందుకు మున్సిపాలిటీపాలకవర్గం తీర్మానం చేసి అధికారులు చర్యలు తీసుకున్నారు. రోడ్లపై టిఫిన్, టీ సెంటర్లు, పండ్ల బండ్లు, మెయిన్ రోడ్డు సెంటర్ ముందు పేర్ల బోర్డు పెట్టడం చేస్తే వాళ్ళపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపార సముదాయాల నిర్వాహకులకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రెండు రోజుల్లో ముందే ఉత్తర్వులు జారీ చేశారు. రేడియల్ రహదారి మధ్య నుండి అటు ఇటు 75 అడుగులు రహదారిని కొలిచి హద్దులు ఏర్పాటు చేశారు. నిర్మాణాలను తొలగించి మలిదశలో పక్కా నిర్మాణాలను సైతం తొలగించే విధంగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందుల నివారణకు చర్యలు : డిపిఓ దేవానంద్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాగర్ రేడియల్ రహదారిలో రోజురోజుకు వాహనాల రద్దీ విపరీతంగా పెరుగుతుండడంతో రహదారిని అక్రమిస్తూ చేపట్టిన అక్రమ నిర్మాణాల వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు పెరుగుతున్నాయి. వాహనదారులు రోడ్డుపైనే నిలుపుతున్నారని ఈ సమస్య నివారణకి ఆక్రమణలను తొలగించే నిర్ణయం తీసుకున్నామని, ప్రజలే స్వచ్ఛందంగా తమ ఆక్రమణలేమైనా ఉంటే తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోవాలని డిపిఓ దేవానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో అట్టహాసంగా ట్రెస్మా క్రీడా పోటీలు ప్రారంభం

ఉప్పల్‌లో జరిగిన ట్రెస్మా క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి, అనంతరెడ్డి తదితరులు

ఉప్పల్, అక్టోబరు 25 ప్రభాతవార్త : తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ట్రెస్మా సలహాదారుడు డా.పి.అనంతరెడ్డి, అధ్యక్షుడు జి.వి.రమేష్, కార్యదర్శి బి.శ్రీనివాసులు, కోశాధికారి ఎస్.రమేష్‌బాబు, సీనియర్ కరస్పాండెంట్లు మల్లారెడ్డి,టి.నర్సింగ్‌రావు, నరేష్‌రెడ్డి, కామేశ్వరి, తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రైవేటు పాఠశాలల నిర్వహకులు ఎంతో ఇబ్బందులు పడ్డారని, వారికి తెలంగాణ ప్రభుత్వం తగు చేయూత అందించినట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి తగు సహకారం అందిస్తామన్నారు. కమిటి సలహాదారుడు డా.పి.అనంతరెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాని పెంపొందించేందుకు తగు కృషి చేస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు క్రీడలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, సాయిజెన్ శేఖర్, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు వేముల సంతోష్‌రెడ్డి, టంటం వీరేష్, నాయబ్ వెంకటేష్, జహంగీర్, యాదగిరిరెడ్డి, మాస శేఖర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

డివిజన్‌లోని పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి : కార్పొరేటర్ శ్రావణ్

చీఫ్ ఇంజనీర్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ శ్రావణ్

నేరెడ్‌మెట్, నవంబర్ 25 ప్రభాతవార్త: 140 డివిజన్ సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ శ్రావణ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి 140 డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం కార్పొరేటర్ శ్రావణ్ మున్సిపల్ చీఫ్ ఇంజనీర్ జియావుద్దీన్‌ను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని గౌతమి స్కూల్ నుండి సరికొండ నర్సింహ్మారెడ్డి గార్డెన్స్ వరకు నాలా పనులు మంజూరు చేయాలని కోరారు. సర్దార్‌పటేల్‌లో జరుగుతున్న కల్వర్టు పనులు ప్రారంభించారు. మిర్జాల్‌గూడ నుండి లాలాగూడ వెళ్ళే రహదారి పాడవ్వడంతో ప్రయాణీకులు, పాదాచారులు ఇబ్బంది పడడం జరుగుతుందన్నారు. ఈ పనులు పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజెపి నాయకులు పాల్గొన్నారు.

దశలవారిగా వార్డు సమస్యలను పరిష్కరిస్తాం : కౌన్సిలర్ విద్యావతి

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ విద్యావతి

హయత్‌నగర్, నవంబరు 25 ప్రభాతవార్తః దశలవారిగా వార్డు పరిధిలోని సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని పెద్దఅంబర్ పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతివిజేందర్‌రెడ్డి అన్నారు. వార్డుపరిధి బ్యాంకు కాలనీలో 8 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న సీసీరోడ్డు పనులకు ఆమె శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... తాగునీరు, డ్రైనేజీకి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తరవాత సీసీరోడ్లు, వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బ్యాంకు కాలనీకి వెళ్లే దారి గుంతలమయంగామారడంతో సీసీరోడ్డు వేయిస్తున్నామని తెలిపారు. వార్డు పరిధిలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వివరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాకేష్‌గౌడ్, ప్రతినిధులు సంతోష్‌గౌడ్, జంగారెడ్డి, మహంకాళిగౌడ్, హనుమంతు, రాజుముదిరాజ్, రత్నమాల, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు గుర్తింపుగా విజయ్‌నేతకు మెమెంటో అందజేత

విజయ్‌నేతకు మెమెంటో అందజేస్తున్న దృశ్యం

వనస్థలిపురం, నవంబర్ 24 ప్రభాతవార్త : బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ టిడిపి అధ్యక్షుడు,సామాజిక సేవకుడు గద్దె విజయ్‌నేతకు లఘు ఉద్యోగ భారతి, భారత్ సేవా సాకర్ ఫోరమ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయనను అభినందించి, మెమెంటోను అందజేశారు. కరోనా సమయంలో విజయ్‌నేత ధైర్యం చెప్పి సుమారు 500 కుటంబాలకు నిత్యావసర సరుకులు అందించడం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా చలివేంద్రాలు, పేదలకు సహాయమందిస్తూ సమాజంలో గుర్తింపు పొందడంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సికింద్రాబాద్ వారు మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో బిఎస్ఎస్ఎఫ్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్, లఘు ఉద్యమ భారతి అధ్యక్షుడు చరణ్‌దేశ్‌ముఖ్, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యం : భాగ్యలక్ష్మి

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట, నవంబర్ 24 ప్రభాతవార్త : మూసారాంబాగ్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని గడ్డిఅన్నారం బస్తీలో ఆమె పాదయాత్ర చేసి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో పడిపోతున్న విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ రోడ్డు తదితర సమస్యల గురించి స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆమె స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా బస్తీ దవాఖాన, ప్రభుత్వ పాఠశాల అంగన్‌వాడి కేంద్రాలలో సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందడి సురేందర్‌రెరడ్డి, రమేష్‌రెడ్డి, గౌర దేవేందర్, యాదగిరి సురేందర్, మోహన్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్, దినేష్, సందీప్, అబాబాయ్, గిరిజ, గాయత్రి, తులసి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సామాజానికి తన వంతు సేవలు : హయత్ హుస్సేన్ హబీబ్

మహిళలకు దుప్పటను పంపిణీ చేస్తున్న హుస్సేన్ హబీబ్

మలక్‌పేట, నవంబర్ 24 ప్రభాతవార్త : సమాజానికి తన వంతు సేవలు అందిస్తానని చావుని డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు హయత్ హుస్సేన్ హబీబ్ పేర్కొన్నారు. చావుని డివిజన్ పిల్లిగుడిసెలు డబుల్ బెడ్ రూం కాలనీ ప్రాంతంలో పలువురికి ఆయన ఆధ్వర్యలోఓ దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఎళ్లవేళలా తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. చలికాలం కావడంతో రోడ్లపై నిద్రించే పేద ప్రజలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. తమ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిసున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సయ్యద్ లాయఖ్ అలీ, సయ్యద్ అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

యంగ్‌మెన్ అసోసియేషన్ ఎవరికి అనుబంధం కాదు

ఉప్పల్, అక్టోబరు 25 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని యంగ్‌మెన్ సెవెన్ సీటర్ అసోసియేషన్ ఎవరికి అనుబంధం కాదని, ఏ పార్టీలో చేరలేదని అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌యాదవ్, మాజీఉపాధ్యక్షులు ఈదుల శ్రీను, తోకల వెంకటేష్, రాచకొండ రమేష్‌లు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ యంగ్ మెన్ సెవెన్ సీటర్ అసోసియేషన్ కొద్ది రోజుల క్రితం ఎఐటియుసిలో చేరినట్లు ప్రచారం చేశారని, తాము ఏ యూనియన్‌లో చేరలేదని స్పష్టం చేశారు. ఇక నుంచి తాము స్వచ్ఛందంగానే ఉంటామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు భాసంకర్, తిరుపతి, అనిత, లక్ష్మియ్య, గంట వెంకట్, నామ రఘుపతి, మల్లేష్, గోవర్ధన్, మల్లయ్య, రాంబాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ పెద్ద చెరువు బండ్ అభివృద్ధి పట్టించుకోరా..?

ఉప్పల్ పెద్ద చెరువుపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం

ఉప్పల్, అక్టోబరు 25 ప్రభాతవార్త : నగర శివారులో చెరువుల అభివృద్ధి గురించి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తుండగా కొన్ని ప్రాంతాల్లో చెరువుల గురించి పట్టించుకోవడం లేదు. ఉప్పల్ పెద్ద చెరువు ఒకప్పటి నాచారం హెచ్ఎంటి చెరువుపై గతంలో హెచ్ఎంటినగర్ నుంచి హైకోర్టు కాలనీకి వెళ్లేందుకు రహదారి ఉండేది. అయితే ఈ దారిని అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి ఆదేశాలు జారీ చేసినా అమలు కావడంలేదు. చెరువుబండ్‌పై కొంతదూరంవరకు ప్రత్యేకంగా పెన్సింగ్ వేసి వదిలిపెట్టారు. బండ్‌పై కొద్ది రోజుల క్రితం వేసిన సెంట్రల్ లైటింగ్ సరిగ్గా పనిచేయడం లేదు. తాత్కాలికంగావేసిన మట్టిరోడ్డు గుంతలమయంగా మారింది. ఉప్పల్ నుంచి నాచారం వెళ్లే వారికి ఈ దారి మీదుగా వెళితే మూడు కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. అయితే చెరువు బండ్‌పై గుంతలు పడి అధ్వాన్నంగా తయారైంది. కనీసం మట్టి వేసి రోడ్డు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చెరువు బండ్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే అవకాశం ఉన్నప్పటికి పాలకులు దీనిపై దృష్టి కేంద్రీకరించడం లేదు. ఇప్పటికైనా స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : పవన్

పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్ కుమార్

ఎల్.బి.నగర్, నవంబర్ 25 ప్రభాతవార్త : అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ శ్రీరామలింగేశ్వర కాలనీలో నిర్మిస్తున్న నూతన బాక్స్ డ్రైనేజ్ పనులను శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్స్ డ్రైనేజ్ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజలకుఎటువంటి ఇబ్బంది కలగకుండా పనులను వేగవంతం చేసి బాక్స్ డ్రైనేజ్ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు.

సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ది : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సైదాబాద్, నవంబరు 25 ప్రభాతవార్త: సిఎం రిలీఫ్ ఫండ్ పేదలపాలిట వరమని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ ఉదయ్‌నగర్ కాలనీకి చెందిన నాగరాజు నోటికాన్సర్‌తో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేను కలిసి తన ఆర్థిక పరిస్థితిని వివరించి సిఎం రిలీఫ్‌ఫండ్ ఇప్పించాల్సిందిగా కోరడంతో సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి : షఫీ

మలక్‌పేట, నవంబర్ 24 ప్రభాతవార్త : డివిజన్‌లోని కాలనీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఓల్డ్ మలక్‌పేట డివిజన్ ఎంఐఎం నాయకుడు సైపుద్దీన్ షఫీ పేర్కొనాఱు. డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ పార్కులో ఆయన పర్యటించి కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కాలనీవాసులు పలు అంశాల గురించి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన స్పందించి కాలనీవాసులు పేర్కొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

సత్యనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

ఉప్పల్, అక్టోబరు 25 ప్రభాతవార్త : రామంతాపూర్ డివిజన్ సత్యనగర్‌కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాలనీలో విద్యుత్, రోడ్డు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలో మౌళిక సదుపాయాల కల్పన కోసం తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. విద్యుత్ ఎఇ రాములను కలిసి పలు సమస్యలు వివరించారు. ప్రజా సమస్యల కోసం తమ వంతు పాటుపడుతామన్నారు. ప్రజల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శైలేందర్, పలువురు సత్యనగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ కార్పొరేషన్ మరిన్ని అవార్డులు సాధించాలి:మేయర్

సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ పారిజాత

సరూర్‌నగర్, నవంబర్ 25 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అన్ని రంగాల్లో ముందుండి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించేలా అధికారులు తోడ్పాటునందివ్వాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, పలువురు కార్పొరేటర్లు కోరారు. బడంగ్‌పేట్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం మేయర్ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. అత్యవసర అభివృద్ధి పనులపై చర్చించే నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అవార్డు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. అదే స్ఫూర్తితో కార్పొరేషన్ మరిన్ని అవార్డులు మున్ముందు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ మేరకు అధికారులలతో పాటు సిబ్బంది, ప్రజలు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డిఇఇలు అశోక్‌రెడ్డి, జ్యోతి,ఎంఇఓ కృష్ణయ్య, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మేనేజర్ నాగేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన దుర్గాభవానినగర్

అయ్యప్ప మాలధారులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సైదాబాద్, నవంబరు 25 ప్రభాతవార్త: చంపాపేట డివిజన్‌లోని దుర్గాభవానినగర్ అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఎలిమినేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు శబరిగిరీషుడిని కొలుస్తూ పాడిన పాటలు అందరిని భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అయ్యప్ప మహాపడి పూజలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొంతం మధుసూధన్‌రెడ్డి గురుస్వామి, ఎలిమినేటి నిషికాంత్‌రెడ్డి గురుస్వామి, టిఆర్ఎస్ నాయకులు నల్ల రఘు మారెడ్డి, ముడుపు రాజిరెడ్డి, రోజారెడ్డి, గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధ్యార్థులు నాయకులుగా ఎదిగేందుకు డిపిఎస్‌లో శిక్షణ

జ్ఞాపికను అందజేస్తున్న యాజమాన్యం

నాచారం, నవంబర్ 25 ప్రభాతవార్త: నాచారం డిల్లి పబ్లిక్ స్కూల్లో విధ్యార్థులు నాయకులుగా ఎదిగేందుకు శిక్షణనిచ్చారు. స్కూల్ చైర్మన్ కొమురయ్య ప్రోత్సాహంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి పలువురు వక్తలు హాజరయ్యారు. బ్రిగేడియర్ వి.రెడ్డి, డైరెక్టర్, పల్లవి స్కూల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ యశ్వస్వి ప్రిన్సిపల్ సునితారావు, వైస్ ప్రిన్సిపల్ నందిత సుంకర్,ది హిందు డిప్యూటీ ఎడిటర్ రవికాంత్ రెడ్డి పాల్గొన్నారు. జంటనగరాల నంచి 28 ప్రముఖ స్కూల్స్ నుంచి పలవురు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు సమాజ సేవ దాని ప్రాధాన్యత గురించి, జీవన నైపుణ్యాల గురించి విద్యార్థులకు అవగాహణ కల్పించారు. బాల్యం నుంచి నిజాయితీ, భాధ్యత యొక్క విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికి జన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయం : టిఆర్ఆర్ కరస్పాండెంట్ దినేష్‌రెడ్డి

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన తీగల దినేష్‌రెడ్డి, జన విజ్ఞాన సంస్థ ప్రతినిధులు

సరూర్‌నగర్, నవంబర్ 25 ప్రభాతవార్త: సమాజంలో చైతన్యానికి జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని టిఆర్ఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ తీగల దినేష్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్‌లోని టిఆర్ఆర్ హై స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలాపూర్ మండల స్థాయిలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన దినేష్‌రెడ్డి జన విజ్ఞాన వేదిక నాయకులతో కలిసి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ విశ్వాసాల నిర్మూలనకు ప్రజల్లో చైతన్యం తేవడానికి అదే విధంగా విద్యార్థుల్లో సృజనాత్మకు పెంపుకు కృషి చేసు్తన్న జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుండడం హర్షణీయమన్నారు. కాగా చెకుముకి టాలెంట్ టెస్టుకు మండలంలోని నాదర్‌గుల్, బడంగ్‌పేట్, జిల్లెలగూడ, లార్డ్స్ తదితర పాఠశాలల నుండి పలువురు విద్యార్థులు హాజరయ్యారు అయితే వీరిలో పలువురు 27వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే పరీక్షకు ఎంపికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు సాయిబాబా, రాష్ట్ర నాయకుడు జగన్మోహన్‌రావు, జిల్లా నాయకుడు కృష్ణమోహన్, టివీజికె రాజు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం : ఎమ్మెల్యే మంచిరెడ్డి

లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

తుర్కయంజాల్, నవంబర్ 24 ప్రభాతవార్త : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రజలందరికీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధిపథంలో ముందుకెళ్తున్నారని అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లి గ్రామంలోని 8 మందికి లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, కందాడ లక్ష్మారెడ్డి, కోంద్రు శ్రీనివాస్, సంపత్ ఈశ్వర్‌రెడ్డి, వేముల అమరేందర్‌రెడ్డి, సామ అమరేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాడ్మింటన్ పోటీల్లో శ్రీ ఆదిత్య విద్యార్థి ప్రతిభ

విద్యార్థి అఖిల్‌రెడ్డి అభినందిస్తున్న ఛైర్మన్ సుధాకర్

వనస్థలిపురం, నవంబర్ 24 ప్రభాతవార్త : వనస్థలిపురంలోని వనస్థలి హిల్స్ కాలనీలోని శ్రీ ఆదిత్య ఐఐటి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి అఖిల్‌రెడ్డి జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో రన్నరప్ సాధించినట్లు విద్యా సంస్థ డాక్టర్ కె.ఎస్.వి. సుధాకర్ తెలిపారు. శ్రీ ఆదిత్యలో 8వ తరగతి చదువుతున్న బొబ్బ అఖిల్‌రెడ్డి నవంబర్ 19 నుండి 23 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన అండర్-13, విభాగంలో బ్యాడ్మింటన్ సింగిల్స్ బాలుర విభాగంలో ఈ ఘనత సాధించారన్నారు. మొత్తం 7 బ్యాడ్మింటన్ ఆటలలో అఖిల్‌రెడ్డి ఆరింటిలో విజయం సాధించాడు. అఖిల్‌రెడ్డి 3వ తరగతి నుండే బ్యాడ్మింటన్ ఆట ఆడడం ప్